www.vastavam.in

# వాస్తవం.ఇన్

డిజిటల్ పత్రిక

ఎడిటర్: దండుగుల శ్రీనివాస్

News you can trust

| సోమవారం | 30-06-2025 |



## నిజామాబాద్‌లో వెల్ నెస్ సెంటర్ ప్రారంభం

నిజామాబాదులో వెల్ నెస్ అడ్వాన్సుడ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ఆదివారం మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ప్రారంభించారు. హైదరాబాద్‌కు దీటుగా కార్పొరేట్ హాస్పిటల్‌కు ఏ మాత్రం తీసిపోకుండా, అత్యాధునిక వైద్య విధానంతో ఏడవ బ్రాంచ్‌ను ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. - వాస్తవం, నిజామాబాద్



# తిడితే గొట్టంగాళ్లు..! పొగిడితే నిఖార్సైన జర్నలిస్టులు..!

## అప్పుడు కేసీఆర్.. ఇప్పుడు రేవంత్...

### ఇద్దరూ ఇద్దరే...! అధికారం వస్తే ఎవరైనా అంతే..!

(దండుగుల శ్రీనివాస్)

తెలంగాణ ఉద్యమంలో మీడియా కేసీఆర్‌ను నెత్తిన పెట్టుకుని మోసింది. కేసీఆర్ కూడా మీడియాకు అంతే విలువిచ్చాడు. ఆయన విలేకరులతో కలిసిపోయే తీరు.. ఇప్పటికీ కొంతమంది ఆనాటి ఉద్యమనేత స్టైల్‌ను యాది చేసుకుంటారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం వరకు మీడియాలో అన్ని సెక్షన్లు కేసీఆర్‌న మోశాయి. కమ్యూనిస్టు భావజాలం ఉన్న జర్నలిస్టులకు కేసీఆర్ నడవడిక నచ్చదు. అయినా తెలంగాణ కోసం తప్పలేదు. ఆ తరువాత ప్రత్యేక రాష్ట్రం వచ్చినంక కేసీఆర్ మారిండు. స్వయంగా తనే చెప్పుకున్నాడు. మాది ఫక్తు రాజకీయపార్టీ అని. ఇక వీరందనీ మోస్తూ పోతే .. నా బతుకు బస్టాండే అనుకున్నాడు కాబోలు. తెలంగాణ వచ్చిన తరువాత అత్యంత హీనంగా చూడబడ్డవాళ్లు, అత్యంత ఘోరంగా అణగదొక్కబడినవాళ్లు, అవమానాలపాలైన వాళ్లు, ఆత్మగౌరవం చంపుకుని బతికినవాళ్లు ఎవరైనా ఉన్నారంటే ఆ జాబితాలో మొదటి వరుసలో తెలంగాణ జర్నలిస్టులుంటారు. అంతటి ఘోర అవమానాల పాలు చేసిండు కేసీఆర్. అదే పాపం శాపంలా వెంటాడింది. ఎవరూ వదల్లేదు. విలేకరులూ వదల్లేదు. ఇది ఎవరి జాగీరు కాదని తేల్చి చెప్పారు. ఫలితం చూస్తూనే ఉన్నాం. అప్పటి వరకు ప్రతిపక్షంలో ఉన్న రేవంత్ మీడియా అంటే ఎంతో గౌరవాన్ని ప్రదర్శించాడు. తెలంగాణ ఉద్యమమప్పుడు జర్నలిస్టులు కేసీఆర్‌ను ఎంతలా ఓన్ చేసుకుని మోశారో... అంతకంటే ఎక్కువగా రేవంత్‌నూ మోశారు. పదేళ్ల పాలన చూసిన తరువాత. అది కేసీఆర్ మీద కోపమే. అహంకార, నియంత పాలనకు ఓ గుణపాఠంగానే. అంతే తప్ప రేవంత్‌లో ఏదో ఉందని కాదు. తప్పదు కాబట్టి రేవంత్‌ను ఎంచుకున్నారు. అంతే. బండి కింద కుక్క నడుస్తూ ఆ బండి తన వల్లే నడుస్తుందనుకున్నట్టు... రేవంత్ కూడా భ్రమపడ్డాడు.

అప్పుడు అధికారంలో ఉన్నప్పుడు కేసీఆర్‌కు మెయిన్ స్ట్రీమ్ మీడియా దాసోహం అన్నది. అధికారం వల్ల వచ్చిన మార్పు అది. కేసీఆర్ లోని సహజ నియంత పోకడలు దీన్ని మరింత ఆస్వాదించాయి. అధికారం చేతిలో ఉంటే ఎవరైనా తలొగ్గాల్సిందేననే తలబిరుసు వంట బట్టించుకున్నాడు. అసలు మీడియానే చిన్నచూపు చూశాడు. పరిస్థితుల రీత్యా అలా ఉండాల్సి వచ్చిందే తప్ప... పాలకుడు రీతి, తమ పాలిట వ్యవహరిస్తున్న తీరును వారు గమనిస్తూనే ఉన్నారు. అవహేళనలు, పట్టింపులేని తనాన్ని పసిగడుతూనే ఉన్నారు. మెయిన్ స్ట్రీమ్ మీడియాదే పరిస్థితి ఇలా ఉంటే.. చిన్న చితక పేపర్ల, చానెళ్ల రిపోర్టర్ల పరిస్థితి మరీ అధ్వానం. కుక్కల కంటే హీనం. డబుల్ బెడ్ రూం ఇండ్లు, ఇండ్ల స్థలాలు, అక్రిడేషన్ కార్డులు, హెల్త్‌కార్డులు.. ఉహూ ఒక్కంటంటే ఒక్కటి సరిగా అమలైంది లేదు. ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా అల్లం నారాయణ చేతులు కట్టుకుని నోరు కుట్టుకుని కూర్చున్నాడు. అదును చూసి దెబ్బ కొట్టారు. కేసీఆర్‌ను ఫామ్‌హౌజ్‌కు పంపారు. ఇప్పుడు రేవంత్ వంతు. అధికారంలోకి రావడానికి మీడియా స్వచ్ఛంధంగా, ఇతోధికంగా పనిచేసింది. అప్పుడు తీన్మార్ మల్లన్నలాంటి జర్నలిస్టు ముసుగులో ఉన్న అరాచకవాదిని సపోర్టు చేసి ఉస్కో ఉస్కో అన్నాడు రేవంత్. ఎట్లాగైనా అధికారంలోకి రావాలి అంతే. వచ్చాడు. కానీ ఏమైంది. కొద్ది కాలంలోనే మీడియాను అసెంబ్లీ సాక్షిగా బట్టలిప్పి కొడతా బిడ్డా అన్నడు. ఎవడు జర్నలిస్టు ఎవడు గొట్టంగాళ్లు.. మీరే తేల్చండి మిత్రులారా..! అని సీనియర్ జర్నలిస్టులతో అన్నాడు బాహాటంగానే. తల్లిని, పెళ్లాన్నీ వదలరా...రా అని బట్టలిప్పి కొడతానన్నాడు. కొంతమంది యూట్యూబర్ల అరాచకాలవి. కేసీఆర్ టైంలోనూ అవి ఉన్నాయి. వాటిని ఎక్కడ తొక్కాలో అక్కడ తొక్కితే సరిపోద్ది. కానీ ఆయన ఇప్పుడు సీఎం కదా మాటలు పడటం వల్ల తలకొట్టేసినట్టైంది. మరి అప్పుడు కేసీఆర్‌ను మల్లిగాడు ఉల్టాపల్టా మాట్లాడినప్పుడు...! ఉస్కో.. ఉస్కో.. శభాష్.. శభాష్.. అన్నదెవరు..?

ఇప్పుడు చెప్పబోయేది కొత్తకథ. ప్రధాన ప్రతిపక్షంలో ఉన్న బీఆరెస్‌పై మహాటీవీ ఫోన్ ట్యాపింగ్‌ను బేస్ చేసుకుని బట్టలిప్పేసుకున్నది. కేటీఆర్‌ను బరిబాతల చేద్దామనుకునే క్రమంలో తనే ముందు జర్నలిజం విలువలు వలువల్లా విడిచేసి నడిరోడ్డుపై నంగా నిలబడ్డది. దీనిపై బీఆరెస్ దూకుడుగా దాడి. ఇది కరెక్టు కాదు. అట్ల ఎంతమందిపై దాడి చేస్తరు. అవన్నీ మీరు పెంచి పోషించిన కుక్కలే. ఆ అరుపులను, గోటి,నోటి గాట్ల గాయాలను ఆపడం, తప్పించుకోవడం మీ వల్లకాదు. అంతలా పెంచారు మరి. ఇక మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి మాట్లాడిన మాటలైతే మరీ దారుణం.. మాకు ఆయుధాలున్నాయి. మేము చూస్తం..చంపుతాం. నరుకుతాం.. ఏడన్నుర్రా బై మీరు ఇంకా. అధికారం పోయినా బుద్ది మారలేదా..? ఇప్పుడు మళ్లీ సీమాంధ్ర పదం గుర్తొచ్చిందా...? ఇంతకన్నా విడ్డూరం మరోటుంది. మంత్రి పొన్నం ప్రభాకర్, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్.. ఇద్దరూ పోలోమని ఆ మహాటీవోడి దగ్గరకి పోయి ఊకో ఊకో అని ఓదార్చడం. అంటే వాడు కేటీఆర్ మీద బరిబాతల థంబ్‌నెయిల్ పెట్టే స్థితికి దిగజారినా.. అది మనకు ఓకే అన్నమాట. మన పాలసీకి వాడు అనుకూలం. కాబట్టి వాడి మీద దాడి మన మీద దాడే. అంతే కదా పొన్నం. అంతే కదా మహేశ్. అంతే కదా సీఎంసాబ్...! మనదాక వస్తే అంతే. అంతే అంతే....!ఎ

# కమలం రథసారథి.. ఈటల..!



## అమిత్ షా ఆమోదంతో ఫైనల్ అయిన రాష్ట్ర అధ్యక్ష పదవి..!

### రేపు ఉదయం 11 గంటలకు ఖరారు..

**రాష్ట్ర బీజేపీ నూతన అధ్యక్షుడిగా ఈటల రాజేందర్ పేరు దాదాపు ఖరారైనట్లే. మొదటి నుంచి ఈటల రాజేందర్ పేరు ప్రతిపాదనలో ఉన్నప్పటికీ సీనియర్లు వ్యతిరేకించడం, సిద్దాంతపరంగా ఆయనకు బలం కలిసి రాకపోవడంతో పెండింగ్‌లో పడింది. రాజకీయంగా, సామాజికంగా చాలా బలంగా ఉన్నప్పటికీ సిద్ధాంతపరంగా ఆయన మద్ధతు లభించలేదు. బండి సంజయ్, ఈటల రాజేందర్ నాయకుల గ్రూపు తగాదాలతో, ఎవరికిస్తే ఏం నష్టమోనని పార్టీ భయపడింది. ఒక దశలో అందరికీ ఆమోదయోగ్యంగా పార్టీ జాతీయ స్థాయి నాయకుడు, ఎంపీ డాక్టర్ లక్ష్మణ్‌కు పగ్గాలు కట్టబెట్టాలనే ఆలోచన చేసింది. ఆయనతో పాటు మాజీ ఎమ్మెల్సీ రామచంద్రారావు పేరు జాబితాలో వస్తున్నది. నిజామాబాద్ పసుపుబోర్డు ప్రారంభోత్సవానికి వచ్చిన అమిత్ షా ఈటల రాజేందర్ పేరును ప్రతిపాదించినట్టు తెలుస్తున్నది.**

మ్యాడం మధుసూదన్
(సీనియర్ పాత్రికేయులు..)

ఈటల రాజేందర్ పేరు దాదాపు ఖరారైందని సమాచారం. లేనిపక్షంలో, కాని పక్షంలో .. చివరి నిమిషంలో మాజీ ఎమ్మెల్సీ రాంచంద్రారావు పేరు తెరపైకి వచ్చే అవకాశం లేకపోలేదు. కొత్త అధ్యక్షుడికి ఈనెల 1న ఘనంగా స్వాగతం పలకడానికి బీజేపీ భారీ ఏర్పాట్లు చేస్తున్నది.

ఈటలకు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా అండగా నిలిచారు. ఈటల రాజేందర్‌కు అధ్యక్ష పదవి ఇవ్వడం వల్ల ఆయనకున్న రాజకీయ అనుభవం, సామాజిక సమీకరణలు కలిసి వస్తాయని భావించారు. ఒకవైపు ముదిరాజ్ సామాజికవర్గం, మరోవైపు రెడ్డి సామాజికవర్గం నుంచి కూడా ఆయనకు సానుకూలత ఉన్నది. ఇప్పటికే మున్నూరుకాపులకు అత్యధిక ప్రాధాన్యత ఉన్నందున ముదిరాజ్ సామాజికవర్గానికి ఇవ్వడం వల్ల పార్టీకి మరింత బలం చేకూరుతుందని లెక్కలేస్తున్నారు. మొదటి నుంచి కేంద్ర హోం శాఖ మంత్రి, పార్టీ వ్యూహకర్త అమిత్ షా ఇవే సమీకరణలలో ఈటల రాజేందర్ అభ్యర్థిత్వం పట్ల పూర్తిగా సుముఖంగా ఉన్నారు. కానీ బండి సంజయ్‌తో పాటు ఇతర సీనియర్ నాయకులతో ఉన్న విభేదాలను ఒక కొలిక్కి తేవడానికి చాలా సమయం తీసుకోవాల్సి వచ్చింది. ఒక దశలో ఇదంతా తలనొప్పి ఎందుకు..? డాక్టర్ కే లక్ష్మణ్‌కు పగ్గాలు అప్పగించి..ఎన్నికల సంవత్సరంలో సమర్థమైన నాయకులకు అప్పగించాలన్న ప్రతిపాదన కూడా వచ్చింది. కానీ డాక్టర్ లక్ష్మణ్‌కు ఇప్పటికే జాతీయ స్థాయిలో మూడు కీలక పదవులు ఉన్నందున ఆయన కూడా అంత సుముఖత వ్యక్తం చేయలేదు. బండి సంజయ్ కు మళ్లీ పగ్గాలు అప్పగించాలని పార్టీ కార్యకర్తలు, కొంత మంది నాయకులు కేంద్రంపై తీవ్రంగా ఒత్తిడి చేశారు. లేని పక్షంలో మధ్యే మార్గంగా డాక్టర్ లక్ష్మణ్ కు గానీ, రాంచంద్రారావు కు గానీ బాధ్యతలను అప్పగించాలని ప్రతిపాదనకు వచ్చింది. ఈ విషయంలో కేంద్ర అధిష్టానవర్గం మేథోమథనం చేయాల్సి వచ్చింది. పార్టీలో గ్రూపు తగాదాలు కొంత సద్దుమనిగిన క్రమంలో ఈటల రాజేందర్ పేరును ఖరారు చేసినట్టు తెలుస్తోంది. మొదట ఈటలకు అధ్యక్ష బాధ్యతలు ఇవ్వడం ఖాయమని వాస్తవం వెల్లడించింది. కానీ తీవ్ర గందరగోళ పరిస్థితుల్లో అధిష్టానం కొంత వెనుకడుగు వేసింది.

అధ్యక్ష పదవి ఫైలును పెండింగ్‌లో పెట్టింది. ఎట్టకేలకు అన్ని సమీకరణలను దృష్టిలో పెట్టుకుని ఈటల వైపే అధిష్టానం మొగ్గు చూపింది. కొత్త అధ్యక్షుడికి అపూర్వ రీతిలో స్వాగతం పలకడానికి బీజేపీ భారీ ఏర్పాట్లు చేస్తున్నది. సునీల్ బన్సాల్ రంగారెడ్డి జిల్లాలో సమావేశం పెట్టి స్వాగత సన్నాహాలను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారు. రంగారెడ్డి జిల్లా మన్నెగూడ వద్దనున్న వేద కన్వెన్షన్ వేదికగా అధ్యక్ష పదవిని ఖరారు చేయనున్నారు. సోమవారం సాయంత్రం వరకు నామినేషన్ దాఖలు కార్యక్రమం సాగుతుంది. నామమాత్రంగా రాంచంద్రారావు లాంటి ఒకరిద్దరు పెద్దలు నామినేషన్ వేసే అవకాశం ఉంది. రేపు ఉదయం 11 గంటలకు వేద కన్వెన్షన్‌లో సమావేశమై ఏకగ్రీవంగా అభ్యర్థిని ప్రకటిస్తారు. అక్కడే సన్మానాలు, సత్కారాలు, ఊరేగింపులు ఉంటాయి.

